ఆదర్శ ఉపాధ్యాయుడు..



2



2

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు..



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీ ఆర్‌ఆర్ వర ప్రసాద్ అన్నారు. ఈ నెల 20న కామారెడ్డి కోర్టులో లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాదాల కేసులు, బ్యాంకు రుణ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు తదితర కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, ఖర్చు ఆదా అవుతాయని, ఇక్కడ ఇచ్చే అవార్డులు తుది తీర్పులుగా చెల్లుబాటు అవుతాయని తెలిపారు.





## మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి..

**అక్షరటుడే, ఇందూరు:** నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. మోదీ పాలన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలో 'మేధావుల సదస్సు' నిర్వహించారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ శాయశక్తులా కృషి చేస్తున్నారని దినేష్ అన్నారు. ఈ మహా యజ్ఞంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పేర్కొన్నారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ నినాదంతో మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.60 కోట్ల నిధులతో ఆధునీకరిస్తున్నారన్నారు. జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన నిజామాబాద్ రైల్వే డబుల్ లైన్ ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.5 వేల కోట్లు కేటాయించారని ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేస్తుందని వివరించారు. గోపిడి స్రవంతి రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, ప్రమోద్ కుమార్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కందగట్ల రామచందర్, మేధావులు డాక్టర్ చిట్టిమల్లి సంతోష్, న్యాయవాదులు సాయి రెడ్డి, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

# యూరియా పోరుతో క్షేత్రబాట



గులాబీ శ్రేణులు తాజాగా రైతు కష్టాలను భుజానికెత్తుకున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉంటున్న బీఆర్ఎస్ మళ్లీ కదం తొక్కుతోంది. యూరియా కొరతతో అల్లాడుతున్న అన్నదాతలకు తోడుగా నిలిచి, ప్రభుత్వ వైఫల్యాలపై సమరానికి సిద్ధమైంది. రైతులకు అండగా బీఆర్ఎస్ క్యాడర్ రోడ్లపైకి వస్తోంది. యూరియా యాప్‌పై సమర శంఖం పూరిస్తోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

■ రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఆందోళనలు ■ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న నేతలు ■ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అడుగులు

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బాల్కొండ, బాన్సువాడ మినహా ఎక్కడా బీఆర్ఎస్ జెండా ఎగరలేదు. కామారెడ్డిలో స్వయంగా కేసీఆర్ పోటీ చేసినా ఫలితం దక్కలేదు. అయితే బాన్సువాడలో గెలిచిన పోచారం తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల అనంతరం క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలు నామమాత్రమయ్యాయనే విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం మళ్లీ యాక్టివ్ కావడంతో బీఆర్ఎస్‌లో జోష్ కనిపిస్తోంది.

### యూరియా పోరుతో..

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న యూరియా సంక్షోభం బీఆర్ఎస్‌కు అవకాశంగా మారింది. 'యూరియా యాప్' పేరుతో రైతులను ఆన్‌లైన్ చుట్టూ తిప్పుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో ఇంటికే ఎరువులు వచ్చేవని గుర్తుచేస్తూ నేతలు జనంలోకి వెళ్తున్నారు. రైతులతో కలిసి నిరసనలకు ప్లాన్ చేస్తున్నారు. రైతులకు తామున్నామనే భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. దాంతో ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ పై సమరశంఖం పూరిస్తోందన్న టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. గురువారం ఉమ్మడిజిల్లాలో భారీ ఎత్తున బీఆర్ఎస్ నిరసనలకు దిగింది. అటు ఎల్లారెడ్డిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లమడుగు సురేందర్ రోడ్డెక్కి యూరియా యాప్‌కు వ్యతిరేకంగా ధర్నా చేశారు. మరోవైపు బాల్కొండలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సైతం జాతీయ రహదారిపై కార్యకర్తలు, రైతులతో కలిసి నిరసన తెలిపారు.

### బీఆర్ఎస్ పాలనను వివరిస్తూ..

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో, తమ ప్రభుత్వ పాలనలో రైతులకు కలిగిన ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. ప్రతి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు నేరుగా రైతుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకునే కార్యక్రమానికి రూపకల్పన చేశారు. గతంలో ఎలాంటి కొరత లేకుండా యూరియా సరఫరా చేసిన విషయాన్ని రైతులకు గుర్తు చేస్తున్నారు.

### రైతుల సమస్యలే ఎజెండా..

రెండేళ్లుగా దాదాపు స్తబ్ధుగా ఉన్న క్యాడర్ ఈ పరిణామంతో మళ్లీ ఉత్సాహం తెచ్చుకుంది. యూరియా పోరాటాన్నే ప్రజాక్షేత్రంలోకి రీఎంట్రీకి వేదికగా మలుచుకున్న గులాబీ దళం, దీని ద్వారా కోల్పోయిన పట్టును తిరిగి సాధించాలనే వ్యూహంతో ముందుకెళ్తోంది. రైతుల సమస్యలను పార్టీ భుజానికెత్తుకొని ముందుకు సాగుతోంది. రైతుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని నేతలు ప్రకటిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో మాజీ ప్రజాప్రతినిధులు గ్రామాల బాట పట్టారు.



## ఆలయ వార్షికోత్సవాల్లో బిగాల దంపతులు

**అక్షరటుడే, నందిపేట్ :** మాక్లూర్‌లోని విఠలేశ్వర రుక్మిణి దేవస్థానం, అయ్యప్ప స్వామి ఆలయం, వీర హనుమాన్ స్వామి ఆలయాల నాలుగో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిగాల సోదరుల ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయాల్లో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## యూరియా యాప్ రద్దు చేయాలని రైతుల ధర్నా

**అక్షరటుడే, గాంధారి:** యూరియా యాప్‌ను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని దుర్గం గ్రామంలోని రైతు వేదిక ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు. అనంతరం ఏఈవోకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యూరియా యాప్' వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే ఆ యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ మొదలై నాట్లు వేసే సమయం వచ్చినా యూరియా దొరకడం లేదని.. ప్రభుత్వం తెచ్చిన యూరియా యాప్ గ్రామీణ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. తమ గ్రామంలో చాలా మంది రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్లు లేవని..ఉన్నా సిగ్నల్ సరిగా రాదన్నారు. యాప్‌లో బుక్ చేసినా ఓటీపీ రావట్లేదని.. సర్వర్ డౌన్ అని చూపిస్తోందన్నారు. దీంతో రైతులకు సమయానికి యూరియా అందడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు మోజీ రామ్ పాల్గొన్నారు. రైతు నాయకులు గంగారాం, పెద్ద సాయిలు, శంకర్, రాగ్య నాయక్, లక్ష్మణ్, సంబాజీ తదితర రైతులు పాల్గొన్నారు.

## జాతీయ అంతరిక్ష కార్యశాలకు రాంపూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎంపిక

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** మండలంలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి. శ్రీహిత జాతీయ స్థాయి అంతరిక్ష కార్యశాలకు ఎంపికైంది. 2026 ఆగస్టులో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక కార్యశాలలో ఆమె రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ప్రపంచ వ్యాప్తంగా 108 దేశాల నుండి 12,000 మంది బాలికలకు రియల్‌టైమ్ శాటిలైట్ ప్రాజెక్టుల ద్వారా సాధికారత కల్పించడమే ఈ మిషన్ లక్ష్యమని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బాలికల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంచేందుకు ఈ అంతర్జాతీయ కార్యక్రమాన్ని రూపొందించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థిని శ్రీహితను డీఈవో అశోక్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో



గెజిటెడ్ హెచ్‌ఎం గంగాసావిత్రి, ఏటీఎల్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ ఖత్రి, ఎంఈవో బోధన్ నాగయ్య, డీఎస్‌వో గంగాకిషన్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నియామకాలపై విచారణ జరిపించాలి

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో 2012లో అధ్యాపకుల నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని డాక్టర్ అంగోతు వెంకట్ నాయక్ ఆరోపించారు. ఆ మేరకు తెయూ వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం డిచ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2012 ఏడాది నియామక ప్రక్రియ ద్వారా 2014లో అధ్యాపకులు నియామకమయ్యారని.. ఈ ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ నియామక ప్రక్రియ తప్పని రుజువు చేస్తూ గత అక్టోబర్ నెలలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. కానీ తెయూలో ఇప్పటి వరకు పాలకమండలి సమావేశం నిర్వహించకుండా, అక్రమ నియామకాలు పొందిన ఉద్యోగులను తొలగించకుండా తాత్సారం చేయడం యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అక్రమ రవాణాను అడ్డుకునేందుకే యూరియా యాప్




**అక్షరటుడే, డిచ్‌పల్లి:** రైతులను కష్టపెట్టే పని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ చేయదని.. అక్రమ రవాణాను అరికట్టేందుకే యూరియా యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అన్నారు. ఖిల్లా డిచ్‌పల్లిలో ప్యాక్స్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా యాప్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సొసైటీలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్‌లో రైతుతో దగ్గరుండి బుకింగ్ చేయించారు. అనంతరం యాప్‌లో తలెత్తే సమస్యలను తెలుసుకొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రం విధించే కోతల కారణంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన స్థాయిలో యూరియా నిల్వలు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన యూరియా నిల్వలను అందరూ రైతులకు పొదుపుగా పంపిణీ జరిగేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో యాప్‌లో అక్కడక్కడ సాంకేతిక కారణాల వల్ల రైతులు కొంత ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల సమస్యల విని.. భరోసా కల్పించేందుకే ఇక్కడికి వచ్చానని, ఒకవేళ చిత్తశుద్ధి లేకుంటే వచ్చేవాళ్లమే కాదన్నారు. సొసైటీ పరిధిలోని 4 గ్రామాల రైతువేదికల నుంచి యూరియా పంపిణీ జరుగుతుందని సొసైటీ ఛైర్మన్ రాంచందర్ గౌడ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మాజీ ఐడీసీఎంఎస్ ఛైర్మన్లు మునిపల్లి సాయరెడ్డి, తారాచంద్, పార్టీ నాయకులు పొలసాని శ్రీనివాస్, వాసు, ధర్మాగౌడ్, అంబర్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గడుగు గంగాధర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బిగాల

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో తెలంగాణ వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ఇంట్లో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగింది. గడుగు గంగాధర్ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగిందని తెలుసుకున్న నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లారు. గడుగును వారి కుటుంబ సభ్యులను కలిసి విచారం వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దగ్ధమైన ఇంటిని పరిశీలించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పీపీ ఆకుల రమేష్, బీఆర్ఎస్ నాయకులు శిల్పరాజు, ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సూత్ సింగ్ ఠాకూర్, దండు శేఖర్, జగత్ రెడ్డి, ప్యాట సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ చేస్తే ఊరుకోం..



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ చేస్తే సహించేది లేదని మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. నగర పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా 11, 45 డివిజన్లలో ఆమె శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. అనంతరం వీధుల పరిశుభ్రత, చెత్త సేకరణ పారిశుధ్య సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష చేశారు. ఆయా కాలనీల్లో ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. అక్కడికక్కడే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు అందజేశారు.

### తాగునీటి వ్యవస్థపై ..

ఆయా డివిజన్లలో తాగునీటి పరిస్థితిపై ప్రత్యేకంగా మేయర్ సమీక్షించారు. కాలనీలో ప్రతి చివరి ఇంటికి కూడా తాగునీరు అందే విధంగా వాటర్ వర్క్స్ సిబ్బంది పనిచేయాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని.. ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, అధికారి భూమేశ్వర్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఉపాధ్యాయుడు..



ఊరిలో సర్కారు పాఠశాలను వదిలి సిటీలో కార్పొరేట్ స్కూల్‌కు దారి కడుతున్న ఈ రోజుల్లో.. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. సర్కారు బడిపై నమ్మకాన్ని పెంచాలనే లక్ష్యంతో తన పిల్లలను సైతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి

■ సర్కారు పాఠశాలలో తన పిల్లలను చేర్పించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ■ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న నాగభూషణం

ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వహిస్తున్న నాగభూషణం తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. తన కొడుకు అశ్రిత్, కూతురు అమూల్యలను ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గూడెం ప్రభుత్వ పాఠశాలలో 1, 2 తరగతుల్లో చేర్పించారు.

### అందరికీ ఆదర్శంగా..

ఒక ఉపాధ్యాయుడిగా విద్యార్థుల తల్లిదండ్రులకు 'ప్రభుత్వ బడుల్లో చేర్పించండి' అని ప్రచారం చేస్తూనే, తాను కూడా ఆచరించి చూపారు నాగభూషణం. ఆయన నిర్ణయం ఎల్లారెడ్డి మండల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలుస్తోంది. ప్రైవేట్ మోజులో పడకుండా ప్రభుత్వ బడులను నమ్మేలా ప్రేరణ ఇస్తోంది.

### ప్రభుత్వ బడిపై ప్రేమ

తెలుగు భాష బోధనలో మాధుర్యం..మమకారం ఎంతగా ఉందో.. ప్రభుత్వ పాఠశాలలపై కూడా అంతే ప్రేమ ఉందని నాగభూషణం అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, స్నేహ భావం ఉంటాయని తాను నమ్ముతానన్నారు. అదే నమ్మకంతో తన పిల్లల భవిష్యత్తును ప్రభుత్వ బడిలోనే వెతుక్కున్నానని ఆయన పేర్కొంటున్నారు. 'ప్రభుత్వ ఉపాధ్యాయులమైన మేము పాఠాలు చెప్పే బడులనే నమ్మకపోతే ఇక ఎవరు నమ్ముతారు..' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇస్తున్న మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం వంటి సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని.. అందరం కలిసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు.



## ఐరన్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో కాకతీయ విద్యార్థి ప్రతిభ


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఐరన్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ టోర్నీలో పాల్గొన్న కాకతీయ పబ్లిక్ స్కూల్ విద్యార్థి డిల్లోడ్ గన్‌రాజ్ ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. టోర్నీలో డిల్లోడ్ ఘన్ రాజ్ 195కిలోల బరువు ఎత్తి శభాష్ అనిపించుకున్నాడు. బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా క్రీడాకారులు గన్‌రాజ్‌ను శుక్రవారం కాకతీయ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా సన్మానించారు. గన్‌రాజ్ తో పాటు ఆయన తల్లిదండ్రులను సైతం స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ.. గన్‌రాజ్ ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రతిభచూపి గోల్డ్ మెడల్ సాధించి కాకతీయ పాఠశాల పేరు నిలబెట్టాడన్నారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## భవానీపేట పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

**అక్షరటుడే,బోధన్:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బోధన్ మండలంలోని భవానీపేట ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నాగయ్య మాట్లాడుతూ గతేడాది ప్రారంభమైన ఈ పాఠశాలలో 28మంది విద్యనభ్యసించారని.. ఈ ఏడాది 15మంది విద్యార్థులు చేరడం ఆనందంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడు కార్తీక్ ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, యువకులు, తల్లిదండ్రుల సమష్టి కృషి వల్ల పాఠశాల అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకుర్దు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కార్తీక్, సీఆర్‌పీ విజయ్, ఇన్

## నగరంలో దారుణం.. రెండున్నర నెలల బాలుడిని హత్య చేసిన తండ్రి..



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** కన్న తండ్రే కాలయముడిగా మారాడు. రెండున్నర నెలల తన కొడుకుని నగరంలోని రైల్వే ట్రాక్ సమీపంలో దారుణంగా హత్య చేశాడు. ఈ అమానుష ఘటన నగరంలో కలకలం రేపింది. నగరంలోని మిర్చి కాంపౌండ్ ప్రాంతానికి చెందిన యువరాజ్ దంపతులకు రెండున్నర నెలల బాబు ఉన్నాడు. ఈ బాబు తనకు పుట్టలేదని అనుమానంతో అతడు నిత్యం భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి నగరంలోని రైల్వే ట్రాక్ పక్కకు బాబును తీసుకొచ్చి కత్తితో నరికి హత్య చేశాడు. రైల్వే ట్రాక్ పక్కన బాలుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ఎస్‌హెచ్‌వో రఘుపతి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగుల నిరసన



**అక్షరటుడే, మెండోరా:** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాన్ని పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రం ఉద్యోగులు ఖండించారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో టీజీపీఈజేఏసీ నాయకులు సతీష్, రఫీక్, దేవరాజ్ నాయకత్వంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని యాజమాన్యం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలు, సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ జే. శ్రీనివాస్‌తో పాటు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



## నగరంలో బస్టాప్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ప్రధాన కూడళ్లలో బస్టాప్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వాసవి క్లబ్ నిజామాబాద్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కోటగిరి రాజేశ్వర్, యెల్లద బాలరాజు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద బస్టాప్‌లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు, వయోవృద్ధులకు సౌకర్యకరంగా ఉండేందుకు తాము కంఠేశ్వర్ బైపాస్ రోడ్ వద్ద బస్టాప్ నిర్మాణానికి ముందుకు వచ్చామన్నారు. స్థలం కేటాయించాలని కోరారు. క్లబ్ ఉపాధ్యక్షులు పైడి వీరేశం, ధన్‌పాల్ వెంకట్, వాసవి క్లబ్ వనిత విక్టరీ నిజామాబాద్ అధ్యక్షురాలు గట్టు హారతి పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ..



**అక్షరటుడే,ఆర్మూర్:** పట్టణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బాధితులకు శుక్రవారం ఫోన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పలువురు బాధితులు తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లుగా తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసు నమోదు చేసుకున్న అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇందులో మూడేళ్ల క్రితం ఫోన్లు పోగొట్టుకున్న వాళ్లు కూడా ఉన్నారన్నారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందించారు.

## గడ్డి మందు తాగి ఒకరి ఆత్మహత్య

**అక్షరటుడే,నందిపేట్:** గడ్డిమందు తాగి ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన నందిపేట్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. నందిపేట్ ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎర్రం పవన్ కుమార్(45)కు రాజేష్ హార్డ్‌వేర్ షాప్ ఉంది. అయితే బిజినెస్‌లో భాగంగా అప్పులు పెరిగిపోవడం అలాగే అప్పుగా వస్తువులు తీసుకెళ్లిన వాళ్లు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆయన మనస్తాపానికి గురయ్యారు. ఈనెల 17న లక్కంపల్లి శివారులో గడ్డి మందు తాగగా ఆయనను వెంటనే నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## యశోద ఆస్పత్రిలో విజయవంతంగా కిడ్నీ మార్పిడి

**అక్షరటుడే, కామారెడ్డి:** యశోద ఆస్పత్రి హైటెక్ సిటీ బ్రాంచిలో కిడ్నీ మార్పిడి విజయవంతంగా నిర్వహించినట్లు సీనియర్ నెఫ్రాలజిస్ట్ డా.విజయవర్మ తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని యశోద బ్రాంచ్ క్లినిక్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో కిడ్నీ సమస్యలు ఏటా పెరుగుతున్నాయని, ప్రతి వంద మందిలో 17 మందికి కిడ్నీ సమస్యలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కిడ్నీ సమస్య ఉందో లేదో తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి బేసిక్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. గత నాలుగేళ్లలో తాము 381కి పైగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేశామని, 95 శాతం సక్సెస్ రేటు నమోదైందని తెలిపారు. పెద్ద వయసు వారు కిడ్నీ ఇవ్వకూడదనేది కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయితేనే కిడ్నీ ఇవ్వాలనే నిబంధన లేదని, గ్రూప్ వేరైనా ఎలాంటి పరిమితులు లేకుండా మార్పిడి చేయవచ్చని చెప్పారు. అయితే బ్లడ్ గ్రూప్ వేరైతే ఖర్చు కొంత అధికమవుతుందని, కానీ మార్పిడి ప్రక్రియ ఒకే విధంగా ఉంటుందని వివరించారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు వల్లే ఎక్కువగా కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. రక్త సంబంధీకులు ఎవరైనా కిడ్నీ దానం చేయవచ్చని చెప్పారు. స్మోకింగ్, ఆల్కహాల్‌కు దూరంగా ఉంటే కిడ్నీ సమస్యలు తగ్గుతాయని సూచించారు. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా నొప్పి మాత్రలు ఎక్కువగా వాడటం వల్ల కూడా కిడ్నీలు ఫెయిల్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో హైటెక్ సిటీ బ్రాంచ్ మేనేజర్ ధనుంజయ్ పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన

**అక్షరటుడే, బాల్కొండ:** మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి సూచించారు. బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, గుట్కాలు వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు, ఓటీపీలు ఇతరులకు తెలియజేయవద్దని పేర్కొన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మండల స్టేషన్ హౌస్ ఆఫీసర్ శైలేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం వంటి కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వ్యక్తిగత జీవితం, కుటుంబం, భవిష్యత్తును దెబ్బతీస్తాయని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని సమాజంలో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్, వేల్పూర్ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మీడియా వైస్ ఛైర్మన్‌గా నాగరాజు

**అక్షరటుడే, భిక్కనూరు:** తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర మీడియా కమిటీ వైస్ ఛైర్మన్‌గా భిక్కనూరుకు చెందిన గజవాడ నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆదేశాలు జారీ చేశారు. భిక్కనూరులో శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, రీజినల్ ఛైర్మన్ శనిశెట్టి గౌరీశంకర్ నియామక పత్రాన్ని గజవాడ నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆర్య వైశ్య మహాసభ ఆశయాలను నెరవేరుస్తానన్నారు. తనను నియమించినందుకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, రీజినల్ ఛైర్మన్ గౌరీశంకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, కోశాధికారి కోడిప్యాక వెంకటేశం, ప్రతినిధులు పబ్బ నాగరాజు, చీకోటి నాగభూషణం, గంగెల్లి మధుసూదన్, పబ్బ కిరణ్, గంజి శ్రీనివాస్, శ్రీరామ్ కృష్ణమూర్తి, సిద్దగిరి, అతిమముల రమేష్, గౌరీశెట్టి రవి కుమార్, జగదీశ్వర్, రమేష్, రాజయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




ఆలూర్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..


నందిపేట్ మండల కేంద్రంలో..

## ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు..

**రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఉమ్మడిజిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీని పీఎం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు.**

– అక్షరటుడే, నెట్‌వర్క్


ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..


ఎల్లారెడ్డి లో..


మెండోరా మండల కేంద్రంలో..